ప్రభాత
# జయభేరి
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజ్‌గిరి | మంగళవారం 18-11-2025
Medchal - Malkajgiri | Tuesday 18-11-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 172 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 172 | Pages : 8 | ₹: 5

**విలేకర్లు కావలెను**

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com



# మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్



- బీసీలకు పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇవ్వాలి
- న్యాయస్థానాల్లో ఈ విషయం తేలిన తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు
- అందెశ్రీ కుమారుడు ఎ. దత్తసాయికి డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం
- ఎస్ఆర్ఎస్పీ మెయిన్ కెనాల్ కు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరును పెట్టాలి

**స్థానిక సంస్థలకు సంబంధించి గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు చేసింది.**

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 17:**

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న సంకల్పంతో గతంలో మంత్రిమండలి తీర్మానం చేయడం, అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం తెలిపిన తర్వాత గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండటం, కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో స్టే విధించడం, ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చిన పరిణామాలను మంత్రివర్గం సమగ్రంగా చర్చించింది. ఈ పరిణామాలను చర్చిస్తూనే, ఎన్నికలు నిర్వహించని పక్షంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రానికి రావలసిన దాదాపు 3 వేల కోట్ల రూపాయల నిధులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడుతున్న నేపథ్యం, కోర్టు సూచనలను పరిగణలోకి తీసుకుని వీలైనంత తొందరగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం తీర్మానించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో శతవిధాలా ప్రయత్నించిన విషయాలను గుర్తుచేస్తూ ఈ అంశంపై న్యాయస్థానాల్లో పోరాటం కొనసాగించాలని నిర్ణయించినట్టు మంత్రిమండలి సమావేశం అనంతరం

...మిగతాది 2 లో



## నిర్ణయం మీరు తీసుకుంటారా? మేము తీసుకోవాలా?

- ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా?

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 17:**

తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు నిర్ణయం మీరు తీసుకుంటారా? మేము తీసుకోవాలా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టు ధిక్కార పిటిషన్‌పై స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. నాలుగు వారాల్లో జవాబు చెప్పాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్

...మిగతాది 2 లో



## షేక్ హసీనాకు మరణశిక్ష

- ఢాకా అల్లర్ల కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష
- షేక్ హసీనాను దోషిగా తేల్చిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ కోర్టు..


**జయభేరి, న్యూ డిల్లీ, నవంబర్ 17:**

బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ సంచలన తీర్పు చెప్పింది. మాజీ ప్రధాని షేక్ హసీనాపై మానవత్వం లేకుండా ప్రయత్నించారని మరణశిక్ష విధించింది. 2009 నుండి 2024 వరకు 15 సంవత్సరాల పాలనలో ఆమె నాయకత్వంలో మారణహోమం జరిగిందని ఐసీటీ నిర్ధారించింది. జరిగిన 2024 జులైఆగస్టు

...మిగతాది 2 లో

## సౌదీలో బస్సు ప్రమాదం

- 45 మంది హైదరాబాద్ వాసులు మృతి..
- ఒక్కరు మాత్రమే సేఫ్!
- ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



2 లో



## మరింత పెరగనున్న చలితీవ్రత

- ఎముకలు కొరికే చలికి జనం తీవ్ర ఇబ్బంది
- ఉదయం వేళల్లో భారీగా పొగమంచు కురుస్తున్నది

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 17:**

తెలంగాణ వ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. ఎముకలు కొరికే చలికి జనం తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఉదయం వేళల్లో భారీగా పొగమంచు కురుస్తున్నది. దానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల రెండురోజులు తెలంగాణలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ చలిగాలులు వీస్తాయని హెచ్చరించింది. మంగళవారం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శీతలగాలులు వీచే ఛాన్స్ ఉందని హెచ్చరించింది.ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెప్పించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖ తెలిపింది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. సోమవారం ఉదయం ఈ సీజన్‌లోనే ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయని వాతావరణశాఖ తెలిపింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిధిలో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొంది. రాజేంద్రనగర్‌లో 10, కంటోన్మెంట్‌లో 11.2, మారేడ్‌పల్లిలో 11.5, కుత్బుల్లాపూర్‌లో 12, గచ్చిబౌలిలో 12 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయని.. సోమవారం రాత్రి సైతం చలి కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం ఉదయం సైతం ఇలాంటి పరిస్థితులే ఏర్పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది.



## పత్తి కొనుగోళ్లపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

- మార్కెట్ యార్డుల్లో రైతుల పడిగాపులు.. కేటీఆర్

**జయభేరి, హైదరాబాద్:**

పత్తి కొనుగోళ్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పత్తిని పండించిన తెలంగాణ రైతన్నలు, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మార్కెట్ యార్డుల్లో పడిగాపులు పడుతున్నారని చెప్పారు. కళ్ల ముందే పండించిన పత్తి ఈ చలికాలపు తేమకు పాడవుతోంటే ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేమో మొద్దు నిద్ర నటిస్తున్నాయని మండిపడ్డారు. నెల రోజుల్లో 28 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా కేవలం 1.12 లక్షల టన్నుల పత్తి కొనుగోలు చేశారంటేనే రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్ళ సంక్షోభానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. తేమశాతం, కపాస్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్, మిల్లుల గ్రేడింగ్ అంటూ కుంటి సాకులతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు నిరాకరిస్తుంటే, దానికి జిన్నింగ్ మిల్లుల అవినీతి తోడై రైతన్న నడ్డి విరుస్తున్నాయని చెప్పారు. మద్ధతు ధర దొరకక, మధ్య దళారులకు తెగనమ్ముకుని రైతులు నష్టాల పాలవుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు వెంటనే పత్తి కొనుగోలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

- రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి
- శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం మహాద్భాగ్యం
- భక్తుల రద్దీకి అనుగుణంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో టిటిడి అధికారులు ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి



**జయభేరి, తిరుపతి:**

కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం మహద్భాగ్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి, సూళ్ళూరుపేట ఎం ఎల్ ఏ లు పులివర్తి నాని, నెలవల విజయశ్రీ, టిటిడి జేఈఓ వీరబ్రహ్మం, అధికారులు తదితరులు పాల్గొన్నారు. పట్టు వస్త్రాలు సమర్పించడానికి విచ్చేసిన మంత్రిలకు

...మిగతాది 2 లో

## హైదరాబాద్ పోలీసులకు అభినందనలు



**హైదరాబద్ సైబర్‌క్రైమ్ పోలీసుల ఆపరేషన్ విజయవంతమైందని వెల్లడించారు. సజ్జనార్‌చర్యలు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయని తెలిపారు.పైరసీ వల్ల సినిమా పరిశ్రమకు నష్టం చేస్తున్న నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనర్ సోమవారం వెల్లడించారు. ఇమ్మడి రవి పై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు మీడియా సమావేశంలో చెప్పారు.**

**జయభేరి, అమరావతి, నవంబర్ 17 :**

ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్‌కల్యాణ్ హైదరాబాద్ పోలీసులకు అభినందనలు తెలిపారు. పైరసీ ముఠాను అరెస్టు చేసిన సజ్జనార్, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పైరసీ ముఠాల వల్ల సినీ పరిశ్రమ తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. ఐబొమ్మ, బెప్పం వెబ్‌సైట్లు మూసివేయించడం స్వాగతించదగ్గ పరిణామని పేర్కొన్నారు. హైదరాబద్ సైబర్‌క్రైమ్ పోలీసుల ఆపరేషన్ విజయవంతమైందని వెల్లడించారు. సజ్జనార్‌చర్యలు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయని తెలిపారు.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్

మంత్రులు మీడియాకు వెల్లడించారు. ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి, న్యాయస్థానాల్లో ఈ విషయం తేలిన తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలని మంత్రిమండలి భావించింది. బీసీలకు పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఫోర్త్ సిటీలో నిర్వహించాలని, అలాగే, డిసెంబర్ 9 న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాలని నిర్ణయించింది. ఇటీవల మరణించిన ప్రజాకవి అందెశ్రీ సేవలను స్మరిస్తూ మంత్రిమండలి తీవ్ర సంతాపం తెలియజేసింది. రాష్ట్ర ప్రజలకు వారందించిన జయ జయహే తెలంగాణ.. రాష్ట్ర గీతాన్ని పాఠ్య పుస్తకాల్లో మొదటి పేజీలో ప్రచురించాలని కేబినేట్ తీర్మానించింది. అందెశ్రీ కుమారుడు ఎ. దత్తసాయికి డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించారు. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాత్రను భావి తరాలకు తెలియజేసేలా వారి అంత్యక్రియలు జరిగిన ప్రదేశాన్ని ఒక స్మృతివనంగా తీర్చిదిద్దాలని తీర్మానించింది. గిగ్ వర్కర్ల ప్రయోజనాల కోసం రూపొందించిన బిల్లుకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసినట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. దీన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టరూపం కల్పిస్తామన్నారు. ప్రజల అభ్యర్థన మేరకు ఎస్ఆర్ఎస్పీ మెయిన్ కెనాల్ కు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరును పెట్టాలని మంత్రిమండలి తీర్మానించింది.

## మేము తీసుకోవాలా?

బీఆర్ గవాయి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వచ్చే వారం లోపలే నిర్ణయం తీసుకోవాలి, లేదంటే స్పీకర్ కాంటెంప్ట్‌కు సిద్ధం కావాలని స్పష్టం చేసింది. స్పీకర్‌కు రాజ్యాంగ రక్షణ లేదని ముందే చెప్పామని గుర్తుచేసింది. న్యూ ఇయర్ ఎక్కడ జరుపుకోవాలో ఆయనే నిర్ణయించుకోవాలని సీజేఐ ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. దీంతో, స్పీకర్ తరపున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం, రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. నాలుగు వారాల్లో జవాబు చెప్పాలని స్పీకర్‌ను ఆదేశించింది.

## శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక..

ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పద్మావతి అమ్మవారి దర్శనానంతరం ఆలయ మర్యాదలతో వేద మంత్రాలతో ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసదాలు మంత్రికి అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం వరుసగా రెండవసారి అని తెలిపారు. నవంబర్ 17 నుండి 25 వరకు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా టిటిడి అధికారులు జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్డిఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆలయాల్లో సముచితమైన ఏర్పాట్ల కారణంగా భక్తుల రద్దీ పెరిగిందని, పంచమి తీర్థం పర్వదినాన సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో టిటిడితో పాటు రాష్ట్రంలో గల ప్రధాన ఆలయాల్లో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించామన్నారు. తిరుచానూరు బ్రహ్మోత్సవాల సందర్భంగా నవంబర్ 20న గౌ. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆలయానికి విచ్చేయనున్నారని, అనంతరం మరుసటి రోజు తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుంటారన్నారు. గౌ. భారత రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం, టిటిడి అధికార మరియు పాలకవర్గాలు ఏర్పాట్లను పూర్తి చేశారన్నారు. కార్తీక మాసంలో భక్తులు అనేక ఆలయాల్లో కార్తీక ద్వీపం వెలిగిస్తారని, దీపాల వెలుగులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెలుగులీనుతుందన్న సంతోషం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్ గా, రాష్ట్రంలోని అన్నీ నగరాలు, ప్రాంతాలు ఆధ్యాత్మికతతో వెలుగులీనుతుందని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో టిటిడి విఎస్ఓ గిరిధర్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, మాజీ ఎంఎల్ఏ నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి కార్పొరేషన్ ఉప మేయర్ ఆర్ సి మునికృష్ణ, టిటిడి అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు అభినందనలు

పైరసీ వల్ల సినిమా పరిశ్రమకు నష్టం చేస్తున్న నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనర్ సోమవారం వెల్లడించారు. ఇమ్మడి రవి పై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు మీడియా సమావేశంలో చెప్పారు. పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినీపెద్దలు చిరంజీవి, నాగార్జున, దిల్‌రాజు, సురేశ్ బాబుతో పాటు దర్శకుడు రాజమౌళి సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. 'పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం. ఇమ్మడి రవి సమాజానికి రెండు రకాలుగా నష్టం చేకూర్చాడు. పైరసీ ద్వారా చిత్రపరిశ్రమకు కోట్ల నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశాడని తెలిపారు. దీంతో చాలా మంది డబ్బు, ప్రాణాలు కోల్పోయారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు. ఇలా 65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు. 21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ వరకు అందులో ఉన్నాయి. పైరసీ ద్వారా రూ.20 కోట్లు సంపాదించాడని తెలిపారు. అందులో రూ.3 కోట్లు సీజ్ చేశాం. సైట్‌ను సందర్శించిన వారి డేటా మొత్తం రవి వద్ద ఉంది. ప్రజల డాటాను సైబర్ నేరాల ముఠాలకు అమ్ముకున్నారు. డేటా చోరీ జరగడం వల్ల ప్రజలకు కూడా వేల కోట్ల నష్టం జరిగింది. రవి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉంది. ఇంత డేటా అతడి వద్ద ఉండటం ప్రమాదకరం. దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని తెలిపారు.

**ఇమ్మడి రవి స్వస్థలం విశాఖపట్నం..**

ఇమ్మడి రవి స్వస్థలం విశాఖపట్నం. బీఎస్సీ కంప్యూటర్స్ చదివిన అతడు వేరే పేర్లతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డులు తీసుకున్నాడు. మొదటి నుంచి నేర ప్రవృత్తితో ఉన్నాడు. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంట పడ్డారని వివరించారు. దీంతో భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ నేవీ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాలు తిరిగేవాడు. 2019 నుంచి ఐబొమ్మ వెబ్‌సైట్‌ను నడుపుతున్నాడు. 21 వేల సినిమాలు పైరసీ చేశాడని వెల్లడించారు. అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్ నుంచి సర్వర్లు నడుపుతున్నాడు. 110 డొమైన్లను రవి ముఠా కొనుగోలు చేసింది.

## హత్యకేసులో నలుగురు నిందితులు అరెస్టు

✍ జయభేరి, హైదరాబాద్:

రాయదుర్గం లో హత్య కేసును రాయదుర్గం పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసారు. నిందితుల వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలు ,నాలుగు మొబైల్ ఫోన్ లు స్వాధీనంచేసుకున్నారు. మాదాపూర్ ఎసిపి శ్రీధర్ నవంబర్ 11 తారీకు మాకు సమాచారం అందింది. రాయదుర్గం లెదర్ ఇండస్ట్రీ వద్ద గాయాలతో ఒక వ్యక్తి పడున్నట్లు మాకు సమాచారం అందింది.. గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించాం. ఆదే ఉదయం పోలీస్ స్టేషన్ లో ఒక మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. చూస్తే గాయాలపాలై హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సౌరబ్ కుమార్(24) గా గుర్తించామని అన్నారు. 13 వ తారీకున హాస్పిటల్ లో చికిత్స పొందుతూ సౌరబ్ కుమార్ మృతి చెందాడు. పోలీసుల దర్యాప్తులో సీసీటీవీ కెమెరాల్లో ఒక ద్విచక్ర వాహనము అనుమానాస్పద గా కనిపించింది.. నడుచుకుంటూ వస్తున్న సౌరబ్ ను బైక్ పై ఎక్కించుకొని చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ ను నలుగురు దుండగులు అడిగారు. సౌరబ్ తో వాగ్వాదానికి దిగారు దుండగులు. సౌరబ్ పై సెంట్రింగ్ కర్రలతో దాడి చేసి అతని వద్ద ఉన్న ఫోన్ ను లాక్కెళ్లారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ రెహాన్, మహమ్మద్ ఇబ్రహీం అహ్మద్ తో పాటు ఇద్దరు మైనర్ లను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. నిందితుల వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలు,నాలుగు మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నాం.

# బీజేపీ నెక్ట్స్ టార్గెట్ ఏంటి..?

**2021లో తీవ్ర ప్రయత్నాలు చేసినా, మమతా బెనర్జీ ఆధిపత్యం తగ్గలేదు. టీఎంసీ మద్దతు వ్యవస్థ గ్రామీణ స్థాయిలో బలంగా ఉంది. అయినా, బీజేపీ వ్యూహకర్తలు కొత్త రూపకల్పనలో ఉన్నారు. రాష్ట్రంలోని 290 సీట్లలో 75 నియోజకవర్గాలు ముస్లిం ఆధిపత్యంలో ఉండటంతో అవి కఠిన లక్ష్యాలుగా భావిస్తున్నారు. మిగిలిన 220 సీట్లలో కనీసం 140కుపైగా గెలవడం ద్వారా ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవలి ఉప ఎన్నికల్లో హిందూ ఓటర్లలో బీజేపీకి 70 శాతం మద్దతు లభించిందని పార్టీ అంచనా. ఈ ధోరణి కొనసాగితే మమతా కూటమిని గద్దె దించే అవకాశం ఉంది.**



బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ... బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించింది. భారతీయ జనతా పార్టీ ఎన్నికల యంత్రాంగం ఇప్పుడు తూర్పు భారత దేశంపై దృష్టి పెట్టింది. ఎన్‌డీఏగా కలిసి 200కుపైగా సీట్లు సాధించడం, కాంగ్రెస్, వామపక్ష శక్తులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయడం బీజేపీకి భారీ ఉత్సాహాన్నిచ్చింది. ఈ విజయానికి మూలం అధునాతన వ్యూహం, కచ్చితమైన సామాజిక గణాంకాల అర్థం చేసుకోవడమే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు అదే మోడల్‌ను బెంగాల్‌లో అమలు చేయాలనే సంకల్పం పార్టీ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది. పశ్చిమ బెంగాల్ బీజేపీకి అందని ద్రాక్షగానే మిగిలింది. 2021లో తీవ్ర ప్రయత్నాలు చేసినా, మమతా బెనర్జీ ఆధిపత్యం తగ్గలేదు. టీఎంసీ మద్దతు వ్యవస్థ గ్రామీణ స్థాయిలో బలంగా ఉంది. అయినా, బీజేపీ వ్యూహకర్తలు కొత్త రూపకల్పనలో ఉన్నారు. రాష్ట్రంలోని 290 సీట్లలో 75 నియోజకవర్గాలు ముస్లిం ఆధిపత్యంలో ఉండటంతో అవి కఠిన లక్ష్యాలుగా భావిస్తున్నారు. మిగిలిన 220 సీట్లలో కనీసం 140కుపైగా గెలవడం ద్వారా ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవలి ఉప ఎన్నికల్లో హిందూ ఓటర్లలో బీజేపీకి 70 శాతం మద్దతు లభించిందని పార్టీ అంచనా. ఈ ధోరణి కొనసాగితే మమతా కూటమిని గద్దె దించే అవకాశం ఉంది. పార్టీ ప్రధాన వ్యూహకర్త అమిత్ షా స్వయంగా బెంగాల్‌లో పటిష్ట కాషాయ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు.

పార్టీ రాష్ట్ర యూనిట్‌కు కేంద్ర సహకారం మరింత పెరిగే సూచనలున్నాయి. బెంగాల్ తర్వాత అసోం కూడా బీజేపీకి చాలా కీలకం. హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో గత రెండుసార్లు గెలిచిన బీజేపీ, మూడోసారి విజయం సాధిస్తే అది కొత్త రికార్డు అవుతుంది. కానీ, ఈ రాష్ట్రంలో అహోం కమ్యూనిటీ, ముస్లిం ఓటర్ల ప్రభావం ఎన్నికల లెక్కలు మార్చే అవకాశం ఉంది.

కాంగ్రెస్, యుడీఎఫ్ కలిసి మైనారిటీ ఓటు బ్యాంకును ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నాయి. బీజేపీ వ్యూహకర్తలు ముస్లిం ప్రభావం ఉన్న 30 ప్రాంతాలను పక్కనబెట్టి మిగతా చోట్ల గట్టి పోరు ఇవ్వాలనే సంకల్పంలో ఉన్నారు. ఇక తర్వాత తమిళనాడులో ఇప్పటి వరకు బీజేపీ గణనీయ స్థాయిలో ఎదగలేదు. అయితే, అన్నామలై నాయకత్వం తీసుకున్న తర్వాత కాషాయ శక్తి కనీసం చర్చనీయాంశంగా మారింది. ఎఐఏడీఎంకేతో కూటమి రీ-అలైన్‌మెంట్, మద్దతు బేస్ విస్తరణ లాంటి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కేరళలో మాత్రం పరిస్థితి భిన్నం. సీపీఎం, కాంగ్రెస్ కూటములు బలంగా ఉండడంతో బీజేపీకి సవాలు కొనసాగుతోంది. 18 శాతం ఓటు వాటా ఉన్నప్పటికీ స్థానాలు దక్కకపోవడం పార్టీకి పెద్ద ప్రతిస్పందనగా నిలిచింది. నరేంద్ర మోడీ తొలిసారి ఎంపీగా విజయం సాధించగానే నేరుగా ప్రధానమంత్రి అయ్యారు. ప్రధాని కాకముందు నరేంద్ర మోడీ చాణక్యతను రాజకీయ విశ్లేషకులు, నాయకులు చాలా తక్కువగా అంచనా వేశారు.

ఆయనకు ఢిల్లీ రాజకీయాల్లో అనుభవం లేకపోవడం, అంతేకాకుండా మోడీ కంటే ముందు అధికారంలో ఉన్న ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌లా ఉన్నత చదువులు లేకపోవడం వల్ల ఆయన విఫలమవుతారని చాలామంది భావించారు., అత్యున్నత పదవులను చేపట్టడానికి విద్య లేదా విశేష అనుభవం అవసరం లేదని నరేంద్ర మోదీ నిరూపించారు. రాజకీయ రంగంలో రాణించాలంటే సాధారణ జ్ఞానంతోపాటు అదృష్టం కూడా చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ప్రధాని మోదీకి ఈ రెండూ పుష్కలంగా ఉన్నాయి. 200 సంవత్సరాల క్రితం ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్‌ను యుద్ధాలను గెలవడానికి ఎలాంటి జనరల్స్ అవసరమని అడిగినప్పుడు.. నెపోలియన్ 'లక్కీ జనరల్స్' అని సూటిగా సమాధానం ఇచ్చాడు. ప్రధానమంత్రిగా మోదీ విజయవంతంగా కొనసాగుతున్నారు. నరేంద్ర మోదీ ఇప్పుడు ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ప్రధానమంత్రిగా మోదీ నిస్సందేహంగా విదేశాంగ వ్యవహారాలు, రక్షణ, అంతర్గత భద్రత, మౌలిక సదుపాయాల వృద్ధి, ఆరోగ్య రంగం తదితర రంగాలలో తనదైన శైలిలో గొప్ప విజయాన్ని సాధించారు.

అయితే, ప్రధానిగా మోదీ పెద్దగా విజయం సాధించని రంగాలు కూడా ఉన్నాయి. వ్యవసాయరంగం, ఉపాధి కల్పన, భారతదేశంలోకి పొరుగు దేశాల నుంచి అక్రమ వలసలను ఆపడం, మధ్యతరగతి వర్గాల ఆందోళనను పరిష్కరించడంలో దేశ ప్రధానిగా మోదీ చాలా తక్కువగా విజయాన్ని సాధించారు. ఆర్థిక వ్యవస్థలో పెద్ద పెద్ద కార్పొరేట్లు విజయం సాధించారు. కానీ, అధిక పన్నుల ద్వారా మధ్యతరగతి ప్రజలను దోచుకున్నారు. మునుపటి ప్రభుత్వాల హయాంలో కూడా ఇదే జరిగింది. 160 సంవత్సరాల క్రితం గొప్ప ఫ్రెంచ్ ఆర్థికవేత్త ప్రౌధాన్ ఇలా అన్నాడు 'భవిష్యత్తు అనూహ్యమైనది'. మోదీ వర్తమానాన్ని మేనేజ్ చేయగలడు. కానీ, భవిష్యత్తును మాత్రం మేనేజ్చేయలేడు. మోదీకి అతిపెద్ద సవాలు ఏమిటంటే కొత్త నాయకులను తయారుచేయడం.

ఆయనలాంటి ప్రజాదరణ ఉన్న వ్యక్తిని కనుగొనడం. కానీ, నా బీజేపీ స్నేహితులు 'భారతదేశంలో ఒకే ఒక్క మోదీ ఉన్నాడు. ఆయనలాంటి నాయకుడు ఇంకొకరు లేరు' అని నాకు చెబుతున్నారు. మోదీ విజయవంతమైన ప్రధానమంత్రి అనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. అయితే, ఆయన లేనప్పుడు ఎవరనే అతిపెద్ద సవాలు వస్తుంది. వారసత్వ ప్రణాళికకు ప్రత్యామ్నాయం లేదు. మీ వారసత్వాన్ని మీరే ప్లాన్ చేసుకోవడం బాధాకరం. కానీ, సామ్రాజ్యాలు పేలవమైన వారసత్వం ద్వారా నాశనమయ్యాయి. మోదీ కొత్త నాయకత్వాన్ని ఎలా తయారు చేసుకుంటాడో చూద్దాం, అదే ఆయన ముందున్న అతిపెద్ద సవాలు.



## షేక్ హసీనాకు మరణశిక్ష

విద్యార్థినేతృత్వంలోని విస్తృత నిరసనల సమయంలో 1,400 మంది పైగా మరణాలకు కారణమయ్యారని తెలిపింది. వీటన్నింటికీ ఆమె బాధ్యురాలని బాధ్యత వహించాలని కోర్టు తీర్పు పేర్కొంది. ఈ తీర్పు బంగ్లాదేశ్ రాజకీయ చరిత్రలో ఒక మలుపుగా మారింది. షేక్ హసీనా, ఆవారి లీగ్ పార్టీ అధ్యక్షురాలు. బంగ్లాదేశ్‌లో అత్యంత ప్రభావవంతమైన రాజకీయ నాయకులలో ఒకరు 2024 ఆగస్టు 5న అల్లర్లు, తీవ్ర ప్రతిఘటనలు, సైనిక జోక్యంతో రాజీనామా చేసి దేశం నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆమె భారతదేశంలో ఆశ్రయం పొందుతున్నారు. ప్రభుతవం కూలిపోవడానికి ముందు జరిగిన ఆదోళనలపై వందలాది అరెస్టులు, హత్యలు, మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసును ICT 2024 ఆగస్టు చివర్లో విచారణకు తీసుకుంది. నిజానికి ఈ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసింది 1971 యుద్ధ అపరాధాలకు సంబంధించినది. కానీ హసీనా పాలనలోని ఇటీవలి సంఘటనలపై దృష్టి సారించింది. ఆరోపణలలో రాష్ట్ర సైనిక దళాలను ఉపయోగించి ఆందోళన చేసిన వారిపై ఆకస్మిక దాడులు, మీడియా సెన్సర్‌షిప్, రహస్య దాడులు చేశారని ఆరోపించారు. అయితే హసీనా తన పాలనను "ప్రజాస్వామ్య పునరుద్ధరణ"గా వర్ణించారు, కానీ ఆమె తరపు సాక్ష్యాలు "అసంపూర్తి, అబద్ధాలని" అని కోర్టు గుర్తించింది. ఢాకాలోని హైసెక్యూరిటీ కోర్టులో. రాజధాని వ్యాప్తంగా భద్రతా బలగాలు మొబైల్ పెట్రోలింగ్‌ల మధ్య తీర్పు ప్రకటించారు. ఈ విచారణకు హసీనా వీడియో లింక్ ద్వారా పాల్గొన్నారు, ప్రాసిక్యూటర్లు ముఖ్య సాక్ష్యాలను సమర్పించారు, వీటిలో 2024 ప్రదర్శనల సమయంలో 1,400 మరణాలకు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు, 500కి పైగా బాధితుల సాక్ష్యాలు ఉన్నాయి. "పొలిటికల్‌మోటివేటెడ్ ట్రయల్" అని హసీనా తరపు లాయర్ వాదించారు. తాను దేశాన్ని బలోపేతం చేశానని హసీనా ప్రకటించారు. విచారణ తర్వాత చీఫ్ జస్టిస్ ఇఖ్బాల్ హసీనా, 12 మంది సహనిందితులకుపై మరణశిక్ష విధించారు. "ఆమె నాయకత్వం మానవత్వానికి వ్యతిరేకమైనది" అని తీర్పులో పేర్కొన్నారు. నిందితులలో మాజీ మంత్రులు, సైనిక అధికారులు ఉన్నారు. తీర్పు ప్రకటన తర్వాత, ఢాకా మరియు చిట్టగాంగ్‌లో ఆవారి లీగ్ మద్దతుదారులు ప్రదర్శనలు నిర్వహించారు. "జడ్జియల్ మర్డర్" అని నిరసనలు నిర్వహించారు. పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి రబ్బర్ బుల్లెట్లతో అణచివేశారు. ప్రస్తుతం హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నందున శిక్ష అమలు చేయడం సాధ్యం కాదు. ఈ తీర్పుపై భార్త స్పందించాహు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా విచారణ జరగాల్సి ఉందని.. వ్యాఖ్యానిచింది. ఆమె మరణశిక్ష అప్పీల్ చేసే అవకాశం ఉంది, కానీ భారత్ నుండి బంగ్లాదేశ్‌కు పంపడం అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు.

## సౌదీలో బస్సు ప్రమాదం

✍ జయభేరి, న్యూఢిల్లీ, నవంబర్ 17:

మక్కా నుంచి మదీనాకు వెళుతున్న యాత్రికుల బస్సు ప్రమాదంలో 45 మంది మరణించారు. 18 మంది మహిళలు, 18 మంది పురుషులు, పదిమంది చిన్నారులు ఈ ఘటనలో చనిపోయారు. బస్సులో ఉన్న వారందరూ హైదరాబాద్‌కు చెందినవారని జాయింట్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. సిటీ నుంచి 54 మంది మక్కా యాత్రకు వెళ్లగా.. అందులో 46 మంది బస్సులో మక్కా నుంచి మదీనాకు వెళ్లి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న బస్సు డీజిల్ ట్యాంకర్ ఢీకొనడంతో తీవ్ర విషాదం నెలకొంది. బస్సులో మంటలు చెలరేగి క్షణాల్లో మొత్తం వ్యాపించడంతో ఒక్కరు మినహా 45 మంది సజీవ దహనం అయ్యారు. అబ్దుల్ షోయబ్ అనే వ్యక్తి గాయాలతో బయటపడ్డాడని అధికారులు తెలిపారు. మృతులు హైదరాబాద్ లోని మల్లెపల్లి, బజార్ ఘాట్, ఆసిఫ్ నగర్ కు చెందిన వారని తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున దాదాపు 1.30 గంటలకు హైదరాబాద్ యాత్రికులు వెళ్తున్న బస్సు, డీజిల్ ట్యాంకర్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో చనిపోయిన వారంతా తెలంగాణలోని హైదరాబాద్ కు చెందిన వారని ఆలస్యంగా తెలిసింది. మక్కా నుంచి మదీనాకు తిరుగు ప్రయాణంలో ముఫ్రీహాట్ అనే ప్రదేశంలో విషాదం చోటుచేసుకుంది. చనిపోయిన వారిలో మహిళలు, పిల్లలు, పురుషులు ఉన్నారు. బస్సులో 45 మంది ప్రయాణించిన లిస్ట్ బయటకు వచ్చింది. మహమ్మద్ అబ్దుల్ షోయబ్ ఒకరు మాత్రమే ప్రాణాలతో బయటపడగా, ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. బస్సు ప్రమాదం మృతుల్లో రహీమున్నీసా, రహమత్ బీ, షెహనాజ్ బేగం, పర్వీన్ బేగం,



జకియా బేగం, షౌకత్ బేగం, ఫర్హీన్ బేగం, జహీన్ బేగం, గౌసియా బేగం, కదీర్ మహ్మద్, మహ్మద్ మౌలానా, షోయబ్ మహ్మద్, సోహైల్ మహ్మద్, మస్తాన్ మహ్మద్, మహ్మద్ మంజూర్, మహ్మద్ అలీతో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు అక్కడి అధికారులు గుర్తించారుప్రమాదం జరిగిన సమయంలో చాలా మంది ప్రయాణికులు నిద్రపోతున్నారు. ట్యాంకర్ నుంచి డీజిల్ లీక్ కావడం ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లో బస్సు మంటల్లో కాలి బూడిదైంది. ఉమ్రా యాత్ర పూర్తి చేసిన తరువాత, వారంతా జియారత్ కోసం వెళ్లడానికి మదీనా వైపు వెళుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబంలో 8 మంది చనిపోగా, మరో కుటుంబంలో 7 మంది మృతిచెందారని సమాచారం.

**ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు..**

సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదంలో తెలంగాణ యాత్రికులు సజీవ దహనం అయ్యారు. మక్కా నుండి మదీనాకు ప్రయాణిస్తున్న సమయంలో డీజిల్ ట్యాంకర్, యాత్రికుల బస్సు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 45 మంది చనిపోయారు. మొత్తం మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. తెలంగాణ యాత్రికులు కొందరు ఉన్నట్టు తెలియడంతో సౌదీలో బస్సు ప్రమాదానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు సౌదీ అరేబియా రియాద్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నారు. బస్సు ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, తెలంగాణ నుంచి ఎంత మంది వ్యక్తులు ఉన్నారో నిర్ధారించడానికి చర్యలు చేపట్టారు.

**న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కాంటాక్ట్ నంబర్లు..**

వందన, పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్, లైజన్ హెడ్ +91 98719 99044, చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ +91 99583 22143. రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ +91 96437 23157.

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం**

సౌదీలో జరిగిన బస్సు ప్రమాదం ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారిని గుర్తించాలని, గాయపడిన వారికి అన్ని విధాలా సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, సౌదీ రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు సహాయం చేయడానికి తెలంగాణ సచివాలయంలో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ప్రమాదానికి సంబంధించి బాధితుల కుటుంబాలకు సమాచారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు హెల్ప్‌లైన్ నంబర్‌లను విడుదల చేసింది, తద్వారా కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం అందుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# వైభవంగా మహా రుద్ర యాగం

- వేద ఘోషతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- రుద్రుడి ఆశీస్సులకై శాస్త్రోక్తంగా 'అగ్ని స్థాపన' క్రతువు
- వేద మంత్రాల నడుమ పవిత్ర అగ్ని జననం
- యాగశాల ప్రాంగణం వేద ఘోషతో మార్మోగింది
- ముఖ్య అతిధులుగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి దంపతులు



**జయభేరి, పరకాల, నవంబర్ 17:**

సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం నందు నిర్వహించిన కార్తీక మాస మహా రుద్ర యాగ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు, ఇనుగాల వెంకట్రాంరెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే మొలుగురి బిక్షపతి దంపతులు పాల్గొన్నారు. ఉదయం విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, యాగశాల ప్రవేశం, రుత్విక్ వరణం, గోపూజ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు రుద్ర నమకం, చమకాలను పఠిస్తూ మహా రుద్ర హోమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు.

లోక కల్యాణం, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ స్థానిక ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో తలపెట్టిన శ్రీ మహా రుద్ర యాగంలో 51 మంది వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమైంది.159 హోమ గుండాలు, 644 జంటలు ఈ హోమంలో పాల్గొనటం విశేషం. 'ఓం నమః శివాయ' అనే పంచాక్షరీ మంత్రం, వేద మంత్రాల ఘోషతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. యాగంలో పాల్గొన్న భక్తులు, ప్రతికూల శక్తుల నుండి రక్షణ, కుటుంబంలో సంతోషం లభిస్తాయని విశ్వసిస్తూ శివుని అనుగ్రహం కోసం మొక్కులు చెల్లించుకున్నారు.

**ఇనుగాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా అన్నదానం**

మహా రుద్ర యాగంలో పాలుపంచుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన వందలాది మంది భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగ కుండా భోజన సదుపాయం కల్పించే ఉద్దేశంతో ఇనుగాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమంను ప్రారంభించారు. అంతే కాకుండా స్వయంగా పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. ఈ యాగ స్థలంలో ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండడంతో పాటు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు విశిష్ట సేవలను అందించారు. వీరితోపాటు అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పాటుగా సేవాభావం కల్గిన వివిధ ప్రాంతాలనుండి నుండి వచ్చిన భక్తులు (సేవాదల్ )వాలంటీర్ లు సేవలందించి యాగం దిగ్విజయంగా ముగియడంలో భాగస్వాములయ్యారు.



## శ్రీ చెన్నకేశ్వర స్వామి గిరి ప్రదక్షణ

**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 17 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని అతి పురాతన మహిమగల చంద్రాయన్ గుట్ట చెన్న కేశ్వర స్వామి ఆలయ గిరి ప్రదక్షిణను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షణ అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జైని చంద్రశేఖర్ గుప్త సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోగుల నరసింహులు, పలుగుల వెంకటేశం, డాకూరి రమేష్, డాకురి పాండు, దుబ్బాక భాస్కర్, దుబ్బాక రవి ,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలి



**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 17 :**

సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలోని బీసీ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో బీసీ కాలనీ ఏర్పడి 10 సంవత్సరాలు గడుస్తున్న నేటి వరకు సిసి రోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థ లేక అక్కడి కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి సిసి రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తలారి మాతయ్య, గడ్డమీది నరసింహ, శాఖా కార్యదర్శి గుండెబోయిన వెంకటేశం, కాలనీవాసులు కసర బోయిన కనకరాజు, కసిర బోయిన ఐలమ్మ, మల్లమ్మ ,సహస్ర, సాయి, రాసాల లాస్య, లతా తదితరులు పాల్గొన్నారు.



## యాదవ సంఘం అధ్యక్షుడిగా ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక

**జయభేరి, మేడ్చల్ :**

యాదవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్ అన్నారు. ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షుడిగా ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్ ను, ఉపాధ్యక్షుడు అనిల్ యాదవ్, సెక్రటరీ సంపత్ యాదవ్, జాయింట్ సెక్రటరీ మురళీ యాదవ్, క్యాషియర్ పెంజర్ల మహేష్ యాదవ్, కమిటీ సభ్యులుగా మోహన్ యాదవ్, ప్రశాంత్ యాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గోపాల్ యాదవ్, నాగేష్ యాదవ్, చంద్రయ్య యాదవ్, నాగమల్లయ్య యాదవ్, శంకరయ్య యాదవ్, రాము యాదవ్, సురేష్ యాదవ్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలుగా సంధ్య ఎన్నిక

**జయభేరి, గార్ల, నవంబర్ 17:**



అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) డోర్నకల్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షురాలుగా సంధ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా వనజ,ఉపాధ్యక్షులుగా పద్మ, విక్టోరియా, కార్యదర్శిగా నీలాదేవి,సహాయ కార్యదర్శులుగా భద్రకాళి, వసంత,సోషల్ మీడియా కన్వీనర్ గా బి.కృష్ణకుమారి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు సిఐటియు గార్ల, డోర్నకల్ మండలాల కన్వీనర్లు కందునూరి శ్రీనివాస్,దాసరి మల్లేశం లు సోమవారం తెలిపారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షురాలు సంధ్య మాట్లాడుతూ,పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా అంగన్వాడీల వేతనాలు రూ. 26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు ) డోర్నకల్ ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నికకు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నేహ బిందు పర్యవేక్షకులుగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాత,ఉపేంద్ర,బి.పద్మ,గౌరి, రుక్కమ్మ, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

# పరువు హత్య కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- జనసేన పార్టీ నాయకులు రాజు నాయక్, ఎం.డి.అష్రఫ్

**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 17 :**




పరువు హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి చర్యలు పునరావృతము కాకుండా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని షాద్ నగర్ జనసేన నాయకులు రాజు నాయక్ ఎం.డి అష్రఫ్ కోరారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ;రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఎల్లంపల్లి గ్రామంలో ప్రేమ వివాహం చేసుకున్నారని నెపంతో వివాహం చేసుకున్న యువకుడి సోదరుడిని ఎత్తుకెళ్లి కిరాతకంగా హతమార్చడం దారుణమని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య యుగంలో ఇలాంటి చర్యలు జరగడం శోచనీయమని అన్నారు.

ప్రేమ వివాహం చేసుకుంటే వాళ్ల సోదరుడైన చంద్రశేఖర్ ను కిడ్నాప్ చేసి హతమార్చారని వివరించారు. హైదరాబాద్ కూత వేటు దూరంలో ఉన్న షాద్ నగర్ లో ఇలాంటి దారుణమైన సంఘటన జరగడం సభ్య సమాజానికి తలవంపులు తెస్తుందని అన్నారు. దళితుడైన యువకుడిని కిడ్నాప్ చేసి చంపిన ఘటనపై ప్రభుత్వం స్పందించి ఇందుకు కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రజావాణి కి 288 దరఖాస్తులు

- కలెక్టర్ పమేలా సత్పతి




**జయభేరి, కరీంనగర్ :**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. 288 అర్జీలు రాగా సత్వర పరిష్కారం కోసం వాటిని వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

# రెండున్నర దశాబ్దాలు కలను సాధ్యం చేసిన సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు

- పాతగొర్లివాన్నిపాలెం గ్రామంలో సి.సి రోడ్ పనులకు శంకుస్థాపన.

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం గొర్లివాన్నిపాలెం పంచాయతీ శివారు పాత గొర్లెవాని పాలెం గ్రామంలో నేటి వరకు ఒక్క సిసి రోడ్ కూడా నిర్మాణం కాలేదు గత 25 ఏళ్లుగా రోడ్డు నిర్మించాలని ఎన్ని ప్రయత్నాలు చేసిన కార్యరూపం దాల్చలేదు గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ నిధులతో రూ 15లక్షల వ్యయంతో నిర్మించబోయే సి.సి రోడ్ నిర్మాణ పనులను శంకుస్థాపనను చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే మా ప్రథమ లక్ష్యంగా ప్రజల సౌకర్యాల కోసం పంచాయతీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల దిశగా చర్యలు తీసుకుంటున్నాము అని తెలిపారు.గొర్లివాన్నిపాలెం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలు త్వరితిగతిన పూర్తి చేసి అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తాం అని అన్నారు. గ్రామ అభివృద్ధి కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్ పోలిరెడ్డి అప్పారావు, రొంగలి అప్పలనాయుడు, రాయవరపు రామునాయుడు, డెక్క రాము గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అరుణాచలంలో మొక్కును చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు



**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 17 :**

తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కావాలని, రెండున్నర సంవత్సరాల క్రితం టీపీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టే విధంగా ఆశీర్వదించాలని కోరుతూ తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షురాలు బొ రెడ్డి అయోధ్య రెడ్డి సహకారంతో అరుణాచలంలో మొక్కుకున్నట్లు తుర్కపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఎరుకల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టి మొక్కును సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కును చెల్లించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమల వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కోట సురేష్, బండారి శ్రీనివాస్, భూక్య రమేష్ నాయక్ పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా పత్తి మిల్లులు బంద్

- రాష్ట వ్యాప్తంగా పత్తి మిల్లులు బంద్ TVN రెడ్డి ప్రకటన
- రైతులకు నష్టం కలిగిస్తున్న 'రైతు కపాసు యాప్' విధానంపై నిరసన




**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడిన TVN రెడ్డి, 'రైతు కపాసు' యాప్ ద్వారా పత్తి కొనుగోలు విధానం రైతులకు ఏ మాత్రం మేలు చేయడం లేదని స్పష్టం చేశారు. చాలా మంది రైతులు నిరక్షరాస్యులు కావడం వలన, సాంకేతికతతో కూడిన ఈ యాప్ వినియోగం వారికి అర్థం కావడం లేదని, దీనివల్ల వారు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు ఈ నిరవదిక సమ్మె మా సమస్యలను పరిష్కరించే వరకు కొనసాగుతుందని తెలిపారు. అదే విధంగా, పత్తి నాణ్యతను వర్గీకరించేందుకు ఉపయోగిస్తున్న L1, L2, L3, L4, L5 వంటి గ్రేడింగ్ విధానాలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కఠిన నిబంధనలను పెట్టడం వలన ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వం పత్తి కొనుగోలు విషయంలో తమకు సహకరించాలని కోరుతూ, తమ సంఘీభావాన్ని తెలిపారు. కేవలం నల్గొండలోనే తాము 40 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తున్నామని, తాము రైతులకు వ్యతిరేకం కాదని, కేవలం ప్రభుత్వ విధానాలపైనే తమ నిరసన అని స్పష్టం చేశారు.జిల్లాలో 8లక్షల బెల్స్ తయారు అవుతాయి. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిగణనలోకి తీసుకుని, పత్తి కొనుగోలులో సరళమైన విధానాలను అమలు చేయాలని యజమానులు డిమాండ్ చేశారు.



## ప్రజలంతా సంతోషాలతో ఉండాలి

- బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 17:

ఆలేరు నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరుకున్నారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో వీరభద్రస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు అమలు చేసి ప్రజాసంక్షేమాభివృద్ధిని కొనసాగిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గుండ్లపల్లి భరత్ గౌడ్, ముక్కెర్ల మల్లేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య,బీర్ల ఫౌండేషన్ ఛైర్మన్ బీర్ల అనిత



జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 17:

ఆలేరు నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తిచేసుకొని గృహ ప్రవేశాలు చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య,బీర్ల ఫౌండేషన్ ఛైర్మన్ బీర్ల అనిత సూచించారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఐదో వార్డులో కళావతి,రమేష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,బీర్ల ఫౌండేషన్ ఛైర్మన్ బీర్ల అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి బీర్ల ఫౌండేషన్ ఛైర్మన్ బీర్ల అనిత చేతుల మీదుగా పట్టుబట్టలు, యాట పొట్టేలును అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఎం నేతలు భీమగాని రాములు గౌడ్, గుండ్లపల్లి భరత్ గౌడ్, సుడుగు జీవన్ రెడ్డి, ముఖ్యర్ల మల్లేష్, బందారపు భిక్షపతి, ఎరుకల హేమేందర్, గుండు నర్సింహ్మా, గుడ్ల నరేష్, రాజు, బాలయ్య,బాల్ రెడ్డి, మనోజ్, సలామ్, నర్సింహా, మహేష్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

- కల్లేపల్లి మహేందర్



జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 17:

ఈనెల 26న ఖమ్మంలో జరిగే సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్ పిలుపునిచ్చారు. సోమవారం యాదగిరిగుట్ట మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో సీపీఐ గ్రామశాఖ సమావేశం నమిల సంజీవ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కల్లేపల్లి మహేందర్ మాట్లాడుతూ.. సిపిఐ పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు అనేక ప్రజా పోరాటలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడిందని గుర్తు చేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచంలోనే సువర్ణ అక్షరాలతో లభించబడిందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నేతలు కాటం శ్రీకాంత్, సుబ్బూరు నర్సయ్య,నమిలే సంజీవ,ర్యాకల సాగర్, మహేందర్, సుబ్బూరు కరుణాకర్, కల్లేపల్లి మల్లేష్, రమేష్,కాటం మల్లుస్వామి, కరుణాకర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడలో చైన్ స్నాచింగ్

జయభేరి, సికింద్రాబాద్:

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గొలుసు దొంగతనం జరిగింది. దమ్మాయిగూడ వద్ద రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న స్వరూప అనే మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును అపహరించుకొని దుండగులు పరారయ్యారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో ఉన్న మంగళసూత్రాన్ని లాక్కొని ఉడాయించినట్లు కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి తెలిపారు. స్వరూపాన్ని మహిళ ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓ ఇంట్లో పనిచేసే బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా వెనక నుండి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు బంగారు గొలుసును లాక్కెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు ఘటన జరిగిన తీరును పరిశీలించి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు

# కులంతార మతంతారా చట్టాన్ని తీసుకురావాలి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన
- సిపిఎం రాష్ట కార్యదర్శి జాన్ వెస్లీ
- కిడ్నాప్ హత్య పెట్రోల్ పోసి నిప్పటించిన కులోన్మాదులు
- ఎర్ర రాజశేఖర్ ను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలి




జయభేరి, షాద్ నగర్, నవంబర్ 17 :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందినదళిత యువకుడు ఎర్ర చంద్ర శేఖర్ ప్రేమ వివాహం చేసుకున్నాడని అతని సోదరుడు ఎర్ర రాజశేఖర్ ను కిడ్నాప్ చేసి హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టిన వధువు తండ్రి కావలి వెంకటేష్ పాత్రధారులు సూత్రధారులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర పోలీసు ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆయన షాద్ నగర్ నియోజకవర్గం ఎల్లంపల్లి గ్రామములో ఎర్ర రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత నెల రోజుల క్రిందట ఎర్ర రాజశేఖర్ భవాని ప్రేమించుకుని చట్టబద్ధంగా మేజర్లు కావడంతో వివాహం చేసుకున్నారని దీనిని జీర్ణించుకోలేని వధువు తండ్రి కావలి వెంకటేష్ మొయినాబాద్ పోలీసుల సహాయంతో పోలీస్ స్టేషన్లోని ఎర్ర చంద్రశేఖర్ తండ్రిపై అన్న జగన్ పై దాడి చేశాడని అన్నారు.

ఆరోజు పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని పోలీసులు సైతం కొట్టారని అదే అలుసుగా తీసుకున్న కావలి వెంకటేష్ ఈ కులాంతర వివాహానికి ఎర్ర రాజశేఖర్ పూర్తిగా సహకరించాడనే ఉద్దేశంతో మాటుగాసి మాట్లాడుకుందాం రా అని పిలిచి నవాబుపేట ఏరియాలో విపరీతంగా కొట్టి హత్య చేసి సజీవ దహనం చేయటం మానవ మృగాలుగా క్రూర హత్యకు పాల్పడ్డారని చెప్పారు రాష్ట్రంలో కుల దురహంకార హత్యలు 142కు చేరుకున్నాయని పోలీసుల యొక్క నిర్లక్ష్యం పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించడం వల్ల జరుగుతున్న వరుస కుల దురహంకార హత్యల్లో భాగమేనని అన్నారు. కుల దురహంకారంతో మానవ మృగాలుగా ప్రవర్తిస్తూ నవ యువకులను బలి తీసుకుంటున్నారని చెప్పారు. ఇటీవల కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కోడలునీ మామ హత్య చేయటం, షాద్ నగర్ లో అన్నను హత్య చేయటం దారుణమన్నారు. ఈ కుల దురహంకార హత్యలను రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షిస్తుందన్నారు. కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయడం లేదన్నారు. ఈ హత్యలో కేవలం వధువు తండ్రి ఒక్కడే కాదని ఈ హత్య వెనుక అనేకమంది ఉన్నారని చెప్పారు ఇలాంటి కుల దురాహంకారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరో కుల దురహంకార హత్య జరగకుండా చట్టరీత్య చర్యలు తీసుకోవాలన్నారు ఇప్పటికైనా పోలీసులు తమ ప్రవర్తన మార్చుకొని చట్టబద్ధంగా మేజర్లైన ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు పోలీసుల రక్షణ వైఫల్యం కారణంగా జరుగుతున్న హత్యలను నివారించాలని చెప్పారు. ముందర నుంచి మేజర్ అయిన ప్రతి యువతి యువకులు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుని స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిందన్నారు దానిని ఎలా ఉల్లంఘిస్తారని చెప్పారు రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని డిమాండ్ చేశారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలన్నారు. రాజశేఖర్ జీవిత సహచరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కిడ్నాప్ కేసు మాత్రమే కాకుండా హత్యానేరంతో పాటు ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుల దురహంకార హత్యలు జరిగినప్పుడు ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం వల్ల ఈ హత్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తీగల సాగర్, జయలక్ష్మి , బాబు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, నరసింహ ,షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి ఎన్. రాజు, పార్టీ నాయకులు శీను నాయక్ , బి. సాయిబాబు, కొంగరి నర్సింలు, శ్రీకాంత్, ఈశ్వర్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాదాసి మాదారి కురువల సర్టిఫికెట్ల జారి ఆలస్యం ఎందుకు

- మాదాసి మాదారి కురువల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదు!
- పేరుకు మాత్రమే ప్రజావాణి! సమస్యల పరిష్కారం మాత్రం శూన్యం

జయభేరి, షాద్ నగర్, నవంబర్ 17 :




మాదాసి మాదారి కురుమల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి చేయడం సరికాదు! తమ న్యాయబద్ధమైన హక్కులు తమకు అందించాలని పోరాటం చేస్తున్న కురువులకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మదాసి కురువల ప్రజావాణి ముట్టడి చేయడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో మహబూబ్ నగర్ జిల్లా, గద్వాల జిల్లా, నాగర్ కర్నూల్ జిల్లా తో పాటు రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ మదాసి కురువ మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటి పిలుపుమేరకు వేలాది మంది మదాసి కురువలు ఆయా కలెక్టరేట్ కార్యాలయాలను ముట్టడించారు. ఈ సందర్భంగా తెలంగాణ మదాసి కురువ మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నత్తి శివరాములు మాట్లాడుతూ; పేరుకు మాత్రమే ప్రజావాణి అని సమస్యలు మాత్రం ఏ మాత్రం పరిష్కారం ఉండదని ఆయన విమర్శించారు. మదాసి కురువ ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు బేషరతుగా జారీ చేయాలని డిమాండ్ చేశారు. పేరుకే ప్రజా ప్రభుత్వం చేసేది నిరంకుశత్వం అని విమర్శించారు. సుమారు 200 కోట్ల రూపాయలు వెచ్చించి కుల గణన చేపట్టిన ప్రభుత్వం మదాసి కురవ జనాభా బహిర్గతం చేయకూడదనే దురుద్దేశంతో కులాల వారిగా జనాభా లెక్కలు సైతం ప్రకటించకుండా పబ్లిక్ డొమైన్ లో పెట్టలేదంటే ప్రభుత్వం మదాసి కురవలకు ఎంత అన్యాయం చేస్తుందో అర్థమవుతుంది. ఎస్సీ రిజర్వేషన్లు 2011జనాభా లెక్కల ప్రకారం, బిసి రిజర్వేషన్లు కులగణన ప్రకారం అని ద్వంద్వ వైకరి కూడా కేవలం మదాసి కురువల హక్కులను కాలరాయాలనే ఉద్దేశమే అని విమర్శించారు. ఇలాగే రెవెన్యూ అధికారులు మొండి వైకరితో వ్యవహరిస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రభుత్వానికి మదాసి కురువల రుచి చూయిస్తామని హెచ్చరించారు. అవసరమైతే పూర్తిగా స్థానిక సంస్థల ఎన్నికలను బహిస్కరించి గ్రామ గ్రామాన ఉధ్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. మదాసి కురువల డిమాండ్స్ వెంటనే నెరవేర్చి ముఖ్యమంత్రి మాటకు రెవెన్యూ అదికారులు గౌరవించాలని డిమాండ్ చేశారు.

### మాదాసి మాదారి కురువల డిమాండ్లు

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని మదాసి కురువ మదారి కురువలందరికీ కులపత్రాలు జారీ చేయాలి. జాతీయ ఎస్సీ కమీషన్ సిఫారసులు అమలు చేయాలి. తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన మెమో నంబర్ 1268 ప్రకారం మరియు జీవో నంబర్ 19 ప్రకారం మదారి కురువ కులజులందరికీ కులపత్రాలు జారీ చేయాలి. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలను డబ్ల్యూ పి 35188 అఫ్ 2023 జడ్జ్ మెంట్ ప్రకారం మదారి కురువ కులజులందరికీ కులపత్రాలు జారీ చేయాలి. ఈ కార్యక్రమంలో కొయ్యల నర్సిములు, తాలుకా అధ్యక్షులు సింధం విఠలయ్య, వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు, గ్రామ సంఘ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి ఆర్థిక సాయం

జయభేరి, పరవాడ:



స్నేహం అనేది చదువుకి మాత్రమే పరిమితం కాదు జీవితాంతం నిలిచే బంధం మని పరవాడ మండలం వాడచీపురుపల్లి జిల్లా పరిషత్తు హై స్కూల్ 2005 / 2006 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు నిరూపించారు.తమతో పాటు కలిసి చదువుకున్న తోటి స్నేహితుడు కూండ్రపు నాగేశ్వరరావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఎటువంటి జీవనోపాధి లేక ఇంటికే పరిమితమైన తోటి స్నేహితుడు కుటుంబానికి ఆర్థిక సాయంతో బాసటగా నిలిచారు.

నాయుడుపాలెం గ్రామ పంచాయతీ కొండవానిపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు నాగేశ్వరరావు 2005 టూ 2006 వరకు వాడచీపురుపల్లి జెడ్పి హై స్కూల్లో తోటి విద్యార్థులతో 10వ తరగతి వరకు కలిసి చదువుకున్నాడు తన తోటి స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు అన్న విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కూండ్రపు నాగేశ్వరరావు స్వగృహానికి వెళ్ళి తోటి స్నేహితుడు నాగేశ్వరరావును పరామర్శించి ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడగి తెలుసుకొని మీకు మేమంతా అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ మనో ధైర్యాన్ని కల్పించారు.

పూర్వ విద్యార్థులు తలో కొంత వేసుకొని తోటి స్నేహితుడు ఆరోగ్య ఖర్చులు నిమిత్తం రూ.58,000/ యాభై ఎనిమిది వేలు రూపాయలు ఆర్థిక సాయాన్ని సమకూర్చి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆర్థిక సాయంతో బాసటగా నిలిచి 79 మంది పూర్వ విద్యార్థులు సామాజిక స్పృహను చాటుకున్నారని పలువురు స్థానిక ప్రజలు అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో సమ్మంగి అప్పలరాజు ,వియ్యపు అప్పలనాయుడు,చీపురుపల్లి హరిబాబు,పైలా రోహిత్,కోరంగి గణేష్,కూండ్రపు ముత్యాలు, చీపురుపల్లి నేస్తాలు,సబ్బవరపు నరేష్,ఒలిశెట్టి ప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు

- సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు

జయభేరి, పరవాడ:

నవంబర్ 7,8,9 తేదీలలో స్కూల్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో పాడేరులో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొని కాంశ్య పతకాలు సాధించిన వేమూరి ఆద్య, గేదెల ఝూనేష్ లు జాతీయ స్కూల్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో నవంబర్ 17నుండి 19 వరకు వారణాసి లో జరుగు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనచున్నారని ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు వారి తల్లి దండ్రులకు,కోచ్ లు శివకుమార్, గోవింద్ లకు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ సీఈఓ కె.నిశాంత్ అభినందనలు తెలిపారు

## ఫ్యూచర్ ఫిల్మ్ ప్రొడక్షన్ 1 మొదటి చిత్రం ప్రారంభం



జయభేరి, దేవరకొండ :

ఫ్యూచర్ ఫిల్మ్ ప్రొడక్షన్ 1 మొదటి చిత్రం ప్రారంభం చేశారు దీనికి కావాల్సిన నటి నటులను ఈరోజు దేవరకొండ లో అడిషను సినిమా బృందం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ ఏడుకొండలు, సముద్రల రేణుక నర్సింహ, పరమేశ, పౌల్ రాజు, డైరెక్టర్ రామకృష్ణ. ఆర్టిస్టు లను సెలెక్ట్ చేయడం జరిగినది.

## ఫోటో, వీడియో అసోసియేషన్ భవనంకు భూమి పూజ



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన భవనంకు భూమి పూజ నిర్వహించిన దేవరకొండ ఫోటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు.



# కళ్లు ఆరోగ్యంగా ఉండి కంటి చూపు మెరుగుపడాలంటే..

పూర్వం మనుషులకు వయస్సు మీద పడితేనే కంటి చూపు కాస్త మందగించేది. వృద్ధాప్యంలోనూ చాలా మందికి కంటి చూపు స్పష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు అలా కాదు. చిన్న వయస్సులోనే చాలా మందికి కంటి చూపు మందగిస్తోంది. చిన్నారులు సైతం కళ్లద్దాలను ఉపయోగిస్తున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అయితే కంటి చూపు మందగించడానికి ప్రధానంగా మనం తీసుకునే ఆహారమే ముఖ్య కారణమని వైద్యులు అంటున్నారు. మనం తీసుకునే ఆహారాల వల్ల కంటి చూపు దెబ్బ తింటుందని వారు చెబుతున్నారు. అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను ప్రస్తుతం చాలా మంది తింటున్నారు. వేపుళ్లు, ప్రాసెస్ చేయబడిన ఆహారాలు, మాంసం వంటి వాటిని అధికంగా తింటున్నారు. వీటిల్లో ఉండే అనారోగ్యకరమైన కొవ్వులు రక్త నాళాల్లో పేరుకుపోతాయి. ఇవి కళ్లకు రక్త సరఫరాను తగ్గిస్తాయి. దీని వల్ల కళ్లకు కావల్సిన పోషకాలు లభించవు. దీంతో కంటి చూపు మందగిస్తుంది. ఇలా మనం తీసుకునే ఆహారాలు కంటి చూపు లోపించేందుకు కారణమవుతున్నాయి.

### ఈ ఆహారాలు మానేయాలి..

వైట్ బ్రెడ్, పాస్తా, చక్కెర పానీయాలు, బేకరీ ఆహారాలను తీసుకుంటే షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. దీర్ఘకాలంలో షుగర్ లెవల్స్ అధికంగా ఉంటే కళ్లలో ఉండే రెటీనాలోని చిన్నపాటి రక్తనాళాలు దెబ్బ తింటాయి. దీని వల్ల డయాబెటిక్ రెటినోపతి వస్తుంది. దీంతో క్రమంగా కంటి చూపు మందగిస్తుంది. ఈ ఆహారాలు కూడా కంటి చూపు దెబ్బ తినేందుకు కారణం అవుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ఉప్పును కూడా అధికంగా తీసుకుంటున్నారు. దీని వల్ల బీపీ పెరిగితే కంటి రెటీనాపై ప్రభావం పడుతుంది. దీర్ఘకాలంలో ఇది కళ్లలో ద్రవాలు పేరుకుపోయేలా చేస్తుంది. దీని కారణంగా కళ్ల చుట్టూ వాపులకు గురవుతాయి. ఇది కూడా కంటి చూపుపై ప్రభావం చూపిస్తుంది. మద్యం అధికంగా సేవించే వారు తరచూ డీహైడ్రేషన్ బారిన పడుతుంటారు. దీని వల్ల కళ్లు తరచూ పొడిబారుతుంటాయి. దీర్ఘకాలంలో ఇది కంటి చూపు మందగించేందుకు, కళ్లలో శుక్లాలు ఏర్పడేందుకు కారణం అవుతుంది. పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కంటి చూపు మందగిస్తుంది.

### వీటిని తీసుకోవాలి..

కంటి చూపు పెరిగేలా చేసేందుకు కూడా మనం ఆహారాలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది. ముఖ్యంగా విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇవి కంటి సమస్యలను తగ్గిస్తాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. పాలకూర, తోటకూర, పుదీనా, కొత్తిమీర వంటి ఆకుకూరలను ఆహారంలో భాగం చేసుకుంటే లుటీన్, జియాజాంతిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి హానికర కిరణాల బారి నుంచి కళ్లను రక్షించడమే కాదు, కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. కళ్లలో శుక్లాలు రాకుండా చూస్తాయి. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. నారింజ, క్యారెట్లు, చిలగడ దుంపలు, గుమ్మడికాయలను ఆహారంలో భాగం చేసుకుంటున్నా కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది. మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. దీని వల్ల కంటి చూపు పెరుగుతుంది. ముఖ్యంగా కళ్లలోని కార్నియా సురక్షితంగా ఉంటుంది. రేచీకటి తగ్గుతుంది.

### ఇవి కూడా మేలు చేస్తాయి..

చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కళ్ల రెటీనాను సంరక్షిస్తాయి. కళ్లు పొడిబారకుండా చూస్తాయి. కళ్లలో ఎప్పుడూ ద్రవాలు ఉండేలా చేస్తాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటాయి. ఇవి కళ్లలో ఉండే రక్త నాళాలను సంరక్షిస్తాయి. ఆయా రక్త నాళాలు వాపులకు గురికాకుండా చూస్తాయి. దీంతో కళ్లు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటాయి. బాదంపప్పు, వాల్ నట్స్, అవిసె గింజలలో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. విటమిన్ ఇ వల్ల కళ్లలోని కణాలు సురక్షితంగా ఉంటాయి. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. కళ్ల ఆరోగ్యానికి కోడిగుడ్లు, పప్పు దినుసులు, శనగలు వంటి ఆహారాలను కూడా తినవచ్చు. వీటిల్లో ఉండే ప్రోటీన్లు కళ్లను రక్షిస్తాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను రోజూ తీసుకుంటూ ఉంటే కళ్లకు జరిగే నష్టాన్ని నివారించవచ్చు. కంటి చూపు మెరుగు పడి కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..


కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. కిడ్నీ వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పని చేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. ఇది కిడ్నీలను శుభ్రం చేస్తుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. కిడ్నీల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. అదేవిధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా 3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

(*NOTE:* ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)





# రెండు భాగాలుగా ఫౌజీ

ప్రభాస్ చేతిలో ప్రస్తుతం ఓ అరడజను పానిండియా సినిమాలున్నాయి. వాటిలో మొదట విడుదలయ్యే సినిమా 'ది రాజాసాబ్'. జనవరి 9న సంక్రాంతి కానుకగా ఆ సినిమా విడుదల కానున్నది. ఈ లైనప్‌లో రెండో సినిమా 'ఫౌజీ'. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ సగభాగం పూర్తయిందని సమాచారం. దేశభక్తి అంశాలతో నిండిన ఈ ప్రేమకథను వచ్చే ఏడాది ఆగస్టులో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదిలావుంటే.. 'ఫౌజీ' సినిమాకు చెందిన ఓ కొత్త సమాచారాన్ని చిత్ర దర్శకుడు హను రాఘవపూడి రీసెంట్‌గా వెల్లడించారు. ఈ సినిమాను రెండు భాగాలుగా తీస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ సెకండ్ పార్ట్.. తొలి భాగానికి ప్రీక్వెల్‌గా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ రెండు భాగాల్లోని ప్రభాస్ పాత్రల గురించి హను రాఘవపూడి చెబుతూ - 'తొలి పార్ట్‌లోని పాత్రకు పూర్తి భిన్నంగా మలి భాగంలోని పాత్ర ఉంటుంది. వలస పాలన నేపథ్యంలో ఈ ప్రీక్వెల్ రూపొందించనున్నాం. పర్సనల్‌గా నన్ను ఇన్‌స్పైర్ చేసిన కొన్ని రియల్ లైఫ్ అనుభవాలు ఇందులో ఉంటాయి.' అన్నారు. ప్రభాస్ సైనికుడిగా నటిస్తున్న ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో ఇమాన్వి కథానాయిక. మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవీంద్రన్ ముఖ్య పాత్రధారులు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# అల్లు అర్జున్ ఫోన్ వాల్‌పేపర్ గమనించారా..?



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. AA22xA6 (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌గా వస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. బాలీవుడ్ భామ దీపికా పదుకొనే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. అల్లు అర్జున్‌కు సంబంధించిన ఓ విషయం ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.అల్లు అర్జున్ వ్యక్తిగత జిమ్ ట్రైనర్ లియోర్డ్ స్టీవెన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్న వర్కవుట్ క్లిప్‌ను పోస్ట్ చేశాడు. ఈ వీడియోలో ట్రేడ్ మిల్‌పై ఉన్న అల్లు అర్జున్ ఫోన్ వాల్‌పేపర్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ క్లిప్ ఆదివారం ఉదయం 10:18 గంటల(నవంబర్ 16, 2025)కు క్లిక్‌మనిపించింది కాగా టైం కింద 2026 మార్చి 27 కూడా ఉంది. వాల్‌పేపర్‌పై నో స్నాక్ నో షుగర్ నో సోడా అనే మూడు సింపుల్ లైన్స్ ఉన్నాయి. ఇక లైన్స్ ఈ లైన్స్ చదివిన అభిమానులు అల్లు అర్జున్ 2026 మార్చి 27 వరకు నో స్నాక్ నో షుగర్ నో సోడా నిబంధనను ఫాలో అవుతాడని క్లారిటీకి వచ్చేస్తున్నారు. అల్లు అర్జున్ క్రమశిక్షణ, ఖచ్చితత్వానికి ఇంప్రెస్ అయిన అభిమానులు తాము కూడా అదే రూల్‌ను ఫాలో అవుతామని చెబుతున్నారు. అట్లీతో బన్నీ చేయబోయే సినిమా 2027లో పూర్తవుతుందని హింట్ ఇచ్చిన మేకర్స్ ఎప్పటివరకు అనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# గూగుల్ నే ఆగం చేసిన నెటిజన్స్..

బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ. పాన్ ఇండియా సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన యానిమల్ సినిమా భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. అర్జున్ రెడ్డి రీమేక్ ద్వారా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సందీప్ రెడ్డి, యానిమల్ చిత్రంతో బాలీవుడ్‌ను షేక్ చేశాడు. ఇందులో రణబీర్ కపూర్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించగా.. సీనియర్ హీరో అనిల్ కపూర్ కీలకపాత్రలో నటించారు. అయితే ఇందులో త్రిప్తి డిమ్రి సైతం చిన్న పాత్రలో కనిపించింది. ఇందులో ఆమె పాత్ర నిడివి తక్కువ సమయమే ఉన్నప్పటికీ ఒక్కసారిగా క్రేజ్ సొంతం చేసుకుంది. దీంతో ఆమెకు హిందీలో వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. యానిమల్ తర్వాత బ్యాడ్ న్యూజ్, భూల్ భూలయ్యా 3 వంటి చిత్రాల్లో నటించింది. ఇప్పుడు సందీప్ రెడ్డి వంగా, ప్రభాస్ కాంబోలో రాబోతున్న స్పిరిట్ చిత్రంలో నటిస్తుంది. ఇదిలా ఉంటే.. యానిమల్ తర్వాత త్రిప్తి పేరు మారుమోగింది. దీంతో గతేడాది గూగుల్ లో అత్యధికంగా సెర్చ్ చేసిన హీరోయిన్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుతం హిందీలో బ్యాక్ టూ బ్యాక్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



# రవీనా టండన్ తనయ టాలీవుడ్ ఎంట్రీ

సీనియర్ కథానాయిక రవీనా టండన్ తనయ రషా తదాని తెలుగు సినీరంగంలోకి అరంగేట్రం చేస్తున్నది. అగ్ర హీరో మహేష్‌బాబు సోదరుడు, దివంగత రమేష్‌బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం చేస్తూ అగ్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ సమర్పణలో ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇందులో రషా తదాని నాయికగా ఎంపికైంది. అజయ్‌భూపతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో మొదలుకానుంది. న్యూఏజ్ లవ్‌స్టోరీగా రూపొందించబోతున్నారు. హిందీలో 'ఆజాద్' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన రషా తదాని ఆ చిత్రంలోని 'ఉయ్ అమ్మా..' అనే పాటతో పాపులర్ అయింది. ఆమె తెలుగు చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: చందమామ కథలు, నిర్మాత: పి.కిరణ్, రచనదర్శకత్వం: అజయ్‌భూపతి.

# గోవా చలన చిత్రోత్సవంలో సత్కారం



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 50ఏండ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడంతోపాటు, నేటికీ అగ్ర కథానాయకులుగా కొనసాగుతున్నందుకు గాను తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, టాలీవుడ్ అగ్రహీరో నందమూరి బాలకృష్ణలకు ఘనమైన సత్కారం జరుగనున్నది. ఈ నెల 20 నుంచి 28 వరకూ గోవాలో జరుగనున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం(IFFI) ప్రారంభ వేడుక ఈ సన్మానాలకు వేదిక కానున్నది.

సమాచారమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్(NFDC), ఎంటర్‌టైన్మెంట్ సొసైటీ ఆఫ్ గోవా(ESG) సంయుక్తంగా గోవా ప్రభుత్వంతో కలిసి ఈ వేడుకను నిర్వహించనున్నాయి.

1975లో కె.బాలచందర్ రూపొందించిన 'అపూర్వ రాగంగళ్' సినిమా ద్వారా తెరంగేట్రం చేసిన రజనీకాంత్, దాదాపు 175పైచిలుకు చిత్రాల్లో నటించి తమిళనాట తిరుగులేని స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారు. ఈ ఏడాదితో ఆయన 50ఏండ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్నారు. భారతీయ సినిమాకు రజనీ చేసిన సేవలకు గాను, భారత ప్రభుత్వం 'పద్మవిభూషణ్' పురస్కారంతో గౌరవించింది. ఇటీవలే 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డును కూడా రజనీకాంత్ అందుకున్నారు.

ఇక నందమూరి బాలకృష్ణ విషయానికొస్తే.. తండ్రి ఎన్టీరామారావు నట వారసత్వాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తూ 50ఏండ్ల కెరీర్‌ను గత ఏడాదే పూర్తి చేసుకున్నారు బాలకృష్ణ. 100పైలుకు చిత్రాలలో నటించడంతోపాటు నేటికీ తెలుగుతెరపై వరుస విజయాలతో దూసుకుపోతున్నారు.

ఇటీవలే భారత ప్రభుత్వం ఆయనను 'పద్మభూషణ్' పురస్కారంతో గౌరవించింది. ఈ విజయాలను దృష్టిలో పెట్టుకొనే ఈ ఇరువురు ఉద్దండులనూ సత్కరిస్తున్నట్టు కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయమంత్రి ఎల్. మురుగన్ తాజాగా వెల్లడించారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**